# జై స్వరాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఇన్చార్జిగా భీమ్ రాజ్



ఇది కద నిజం :రంగారెడ్డి జిల్లా జై స్వరాజ్ పార్టీ ఇంచార్జిగా మలికి భీమ్ రాజ్ ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు గౌడ నియమించారు. హైదరాబాద్లో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో భీమ్ రాజ్ ను జై స్వరాజ్ పార్టీలోకి ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. భీమ్ రాజ్ కు రంగారెడ్డి జిల్లాలో ఉన్న పరిచయాలతో పాటు గత రాజకీయ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. నియమిత కాలంలో జిల్లాలోని అన్ని మండల పార్టీ కమిటీలు వేయడంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ కార్యాచరణ చేపట్టాలని కేఎస్ఆర్ గౌడ ఈ సందర్భంగా భీమ్ రాజ్ ను ఆదేశించారు. ఇదే క్రమంలో జిల్లా కమిటీని ప్రకటిస్తామని ఆయన చెప్పారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం ఎట్లా ఎర్రవల్లి గ్రామానికి చెందిన భీమ్ రాజ్ జై స్వరాజ్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు . ఈ సందర్భంగా భీమ్ రాజ్ మాట్లాడుతూ తనకు పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ ఇచ్చిన బాధ్యతలు నిర్వహిస్తూ, జిల్లాలో పార్టీ నిర్మాణ కార్యక్రమాలు చేడుతానని అన్నారు. పార్టీ నియమాలు పాటించడంతో పాటు క్రమ శిక్షణతో ఉంటానని ఆయన తెలిపారు. తక్షణమే పార్టీ నిర్మాణ కార్యక్రమాలు చేపడుతానని పార్టీ అధినేతతో భీమ్ రాజ్ అన్నారు. అలాగే తనకు జిల్లా ఇన్చార్జి బాధ్యతలు ఇవ్వడంలో సహకరించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు

# గౌరారంలో వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

## రథోత్సవం, కుస్తీ పోటీలు అమోఘం



ఇది కద నిజం,గౌరారం (పిట్లం), ఏప్రిల్ 3: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన రథోత్సవం కన్నుల పండువగా సాగింది. వేడుకల్లో భాగంగా నిర్వహించిన కుస్తీ పోటీలు, భక్తిగీతాల ఆలాపన మరియు ఆధ్యాత్మిక ప్రవచనాలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్దలు జె. శంకర్, మాజీ సర్పంచ్ అనసూయ, శంకర్, ఎస్. రాములు, డి. సాయిలు, ఉప సర్పంచ్ హనుమాన్లు, సంతు, కొంద్రవిటల్, కుమ్మరి రాజు, రేంజర్ల సాయిలు, కుమార్, రమేష్, మైసూరు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ వేడుకలతో గౌరారం గ్రామం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.

# కల్వరి టెంపుల్‌లో భక్తుల రద్దీ



మియాపూర్: (ఇది కద నిజం ): క్రైస్తవ మతానికి అత్యంత ప్రాధాన్యమైన గుడ్ ఫ్రైడే సందర్భంగా మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌లో వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. లోకరక్షకుడైన యేసుక్రీస్తు సిలువ వేయబడిన దినాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉదయం నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. యేసుక్రీస్తు త్యాగం, ప్రేమ, క్షమాగుణాలపై బ్రదర్ అందించిన దైవ సందేశం భక్తులను ఆలోచనలో ముంచెత్తింది. జీవితంలో నైతిక విలువలు పాటించాలని, ప్రేమ, సేవాభావంతో జీవించాలని ఆయన సందేశంలో సూచించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీస్తు సిలువ (క్రూసిఫిక్షన్) ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యేసుక్రీస్తు అనుభవించిన శ్రమలు, బాధలను కళ్లకు కట్టినట్లుగా ప్రతిబింబించిన ఈ ప్రదర్శన భక్తులను భావోద్వేగానికి గురి చేసింది. చాలామంది భక్తులు కన్నీళ్లు పెట్టుకుంటూ ప్రార్థనలు చేశారు.

వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ట్రాఫిక్ నియంత్రణకు స్థానిక పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.గుడ్ ఫ్రైడే సందేశం సమాజంలో శాంతి, సహనం, ప్రేమను పెంపొందించాలని పాస్టర్లు ఆకాంక్షించారు.





# లాయర్ ప్రతినిధిపై జనసేన శ్రేణుల అరాచకం..

ఇది కద నిజం: రైల్వే కోడూరు నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఒక దారుణ ఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ ఆదేశాల మేరకు, లాయర్ ఆజాద్ తమ్ముడైన గోపి అనే వ్యక్తి కేసు వివరాల సేకరణ కోసం రైల్వే కోడూరుకు చేరుకున్నారు. బాధితురాలు హర్ష వీణకు అండగా నిలిచే క్రమంలో, నిత్యవసర సరుకులు కొనుగోలు చేయడానికి టోల్ గేట్ సమీపానికి వెళ్లిన గోపిపై జనసేన నాయకులు మరియు ఎమ్మెల్యే అనుచరులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు.?ఈ దాడి అత్యంత కిరాతకంగా సాగింది. ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ సమక్షంలోనే తాతంశెట్టి నాగేంద్ర మరియు అతని అనుచరులు కత్తులు, కర్రలతో గోపిని, హర్ష వీణను తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో వారు రక్తసిక్తమవ్వడమే కాకుండా, బాధితురాలు హర్ష వీణను కులం పేరుతో దూషిస్తూ అవమానించడం గమనార్హం. ఒకవైపు ఈ ఘటనకు జనసేన పార్టీకి ఎటువంటి సంబంధం లేదని చెబుతూనే, మరోవైపు పార్టీ నాయకులు ప్రత్యక్షంగా ఈ దౌర్జన్యంలో పాల్గొనడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఇంతటి అమానుష ఘటన జరిగినప్పటికీ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గానీ, ఇతర ముఖ్య నాయకులు గానీ స్పందించకపోవడంపై బాధితులు మరియు ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# నేరడి బ్యారేజికి లైన్ క్లియర్ : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం(ఇది కద నిజం) ఏప్రిల్ 03 : వంశధార నదిపై నేరడి బ్యారేజి నిర్మాణానికి సంబంధించి నదీ జలాల ట్రిబ్యునల్ తుది తీర్పుకు అనుగుణంగా కేంద్ర జలశక్తి శాఖ తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో క్షేత్ర స్థాయిలో ఉభయ రాష్ట్రాల అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటించిన ట్రిబ్యూనల్ కమిటి చైర్మన్ ముకుందం శర్మ నివేదిక మేరకు గజిట్ నోటిఫీకేషన్ విడుదలైంది. సీడబ్ల్యూసీ పర్యవేక్షణ ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల ఇంజనీరింగ్ లసమన్వయం ,జల ఒప్పందం మేరకు వినియోగం తదితర అంశాలను జోడించి గజిట్ నోటీఫకేషన్ జారీ అయింది.

ఈ గజిట్ విడుదల ఆనందంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. వ్యవసాయ ఆధారిత శ్రీకాకుళం జిల్లా భవిష్యత్తుకు ఇది ఒక చరిత్రాత్మక మలుపుగా ఆయన అభివర్ణించారు.

ఈ తీర్పుతో వంశధార నదిపై నేరడి బ్యారేజ్, దానికి సంబంధించిన అనుబంధ నిర్మాణాల ఏర్పాటుకు అన్ని ఆటంకాలు తొలగిపోయాయని అన్నారు. ట్రిబ్యునల్.. గొట్టా బ్యారేజి వద్ద వంశధార నది జలల లభ్యతను 115 టీఎంసీలుగా ఖరారు చేయగా, దానిలో సగం నీరు.. రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగపడనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ సామర్థ్యం గణనీయంగా పెరగనుందని, రైతాంగం తన సాగు నీటి పరిధి విస్తరించి జిల్లాను సస్యశ్యామలం చేసుకునే దిశగా ముందడుగు పడుతుందని రామ్మోహన్ నాయుడు అన్నారు.

ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న ఈ సున్నితమైన, క్లిష్టమైన అంశంలో సమస్య పరిష్కారానికి తాను ఎన్నో ప్రయత్నాలు చేశానని రామ్మోహన్ నాయుడు అన్నారు. పార్లమెంట్ లో, జాతీయ స్థాయి వేదికలలో.. ఇలా ప్రతీ అవకాశాన్ని సమస్య పరిష్కారం కోసం వాడుకున్నామని తెలిపారు. ఆ నమ్మకంతోనే కొద్ది నెలల క్రితం జరిగిన దివంగత ఎర్రంనాయుడు గారి 69వ జయంతిలో సైతం నేరడి బ్యారేజి పూర్తికి స్పష్టమైన హామీ ని ఇచ్చిన్నట్టు రామ్మోహన్ నాయుడు గుర్తు చేశారు.

ఈ ప్రాజెక్టు ద్వారా శ్రీకాకుళం జిల్లా ఆర్థికంగా, వ్యవసాయపరంగా మరింత ఉన్నతికి చేరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరి సహకారంతో ప్రాజెక్టును సమర్థవంతంగా, పారదర్శక పద్ధతిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఈ సమస్యపై విజయంలో తోడ్పాటు అందించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు, ట్రిబ్యునల్ సభ్యులకు మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వేసవిలో కూల్ జర్నీ.. తక్కువ ధరలో ఏసీ బస్సులు అందిస్తున్న టీజీఎస్ఆర్టీసీ !




మియాపూర్ (ఇది కద నిజం ):ఏసీ బస్సుల్లో తక్కువ ఛార్జీలతో ప్రయాణానికి గ్రీన్ సిగ్నల్

గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ సమ్మర్ స్పెషల్ ఆఫర్‌ను ప్రకటించింది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు చల్లని ప్రయాణానుభవాన్ని అందించేందుకు ఈ ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

మియాపూర్-2 డిపో మేనేజర్ శ్రీ వెంకటేశం గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, మెట్రో ఎక్స్‌ప్రెస్ మరియు మెట్రో డీలక్స్ బస్సుల ఛార్జీలకే ఇప్పుడు ఏసీ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించారు. తక్కువ ధరలో అధిక సౌకర్యం కలిగించే ఈ ఆఫర్ ప్రయాణికుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఈ ఆఫర్ కింద ముఖ్య మార్గాల్లో ఛార్జీలు ఇలా ఉన్నాయి:

జేఎన్టీయూ -- ఇన్ ఆర్బిట్ మాల్ -- బయో డైవర్సిటీ: రూ. 40 మాత్రమే

జేఎన్టీయూ -- వేవ్ రాక్: రూ. 45 మాత్రమే

పటాన్‌చెరు -- సికింద్రాబాద్: రూ. 55 మాత్రమే

ఉద్యోగస్తులు, విద్యార్థులు మరియు ప్రతిరోజూ ప్రయాణించే వారందరికీ ఈ ఆఫర్ ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది. తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ఏసీ ప్రయాణాన్ని అందించాలనే లక్ష్యంతో టీజీఎస్ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రయాణికులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మియాపూర్-2 డిపో మేనేజర్ శ్రీ వెంకటేశం గౌడ్ మీడియాకు విజ్ఞప్తి చేశారు.

# నేడు నాయుకులకు కార్యకర్తలకు అందుబాటులో నేదురుమల్లి




ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(ఇది కద నిజం):-ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనివైయస్సార్సీపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి నేడు అనగా 04.04.2026 శనివారం ఉదయం 9 గంటల నుండి వెంకటగిరి లోని నేదురుమల్లి నివాసంలో వైఎస్ఆర్సిపి నాయకులు , కార్యకర్తలు , అభిమానులకు అందుబాటులో ఉండనున్నారు. వెంకటగిరి వైఎస్సార్సీపీ కార్యాలయం ప్రకటనలో తెలిపారు.

# రాపూరు పట్టణంలోఅమరావతి రాజధానిగా గుర్తింపు పై కూటమి నేతల సంబరాలు



నెల్లూరు జిల్లారాపూరు (ఇది కద నిజం):- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన గుర్తింపు లభించడంపై కూటమి శ్రేణులు సంబరాల్లో మునిగితేలారు. పట్టణం లోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ముందు కూటమి నాయకులు భారీ ఎత్తున కాల్చి ఆనందం వ్యక్తం చేసారు. ప్రయాణికులకు,. ప్రజలకు స్వీట్లు పంచి తమ సంతోషాన్ని పంచుకున్నారు. “జై అమరావతి” అంటూ నినాదాలతో జై కొట్టారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు నల్లవడ్ల వెంకట రమణ రెడ్డి, యం.యం.టి.మధు రెడ్డి, చాన్ భాష,రాపూరు మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దూడల పెంచలయ్య జనసేన నాయకులు కొండాపురం కస్తూరి, తదితరులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలి పబ్‌లపై ఈగల్ టీం దాడులు -- 8 మందికి డ్రగ్స్ పాజిటివ్



గచ్చిబౌలి:(ఇది కద నిజం మీడియా):నగరంలోని పబ్‌లలో డ్రగ్స్ వినియోగంపై కట్టడి చర్యల భాగంగా ఈగల్ టీం, పోలీసులతో కలిసి గచ్చిబౌలి పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. కోండాపూర్‌లోని క్వాక్ అరినా పబ్‌లో ప్రత్యేకంగా దాడులు నిర్వహించి సందేహాస్పద వ్యక్తులను పరీక్షించారు.ఈ తనిఖీల్లో మొత్తం 8 మందికి డ్రగ్స్ వినియోగం చేసినట్లు ప్రాథమిక పరీక్షల్లో తేలింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న నెట్‌వర్క్‌పై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. పబ్ యాజమాన్యం పాత్రపై కూడా విచారణ కొనసాగుతోంది.ఇటీవల నగరంలో డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. పబ్‌లు, నైట్‌క్లబ్‌లపై ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.యువత డ్రగ్స్ వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

